సాక్షి కామారెడ్డి

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



ఘనంగా సైన్స్ డే

జిల్లాలో బుధవారం సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

- 9లో ▸



సమర్థవంతంగా పనిచేయాలి

నేర విచారణలో సమర్థవంతంగా పనిచేయాలని. కేసులను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0 /17.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి 'గృహజ్యోతి' అమలు

కామారెడ్డి టౌన్: గృహజ్యోతి పథకం మార్చి ఒకటో తేదీనుంచి అమలులోకి వస్తుందని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్ అందిస్తామని పేర్కొన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని లేదా ప్రజాపాలన దరఖాస్తులో వివరాలు సరైనవి లేక లబ్ధి పొందలేకపోతున్నవారు స్థానిక ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నట్లయితే దరఖాస్తు పరిశీలన పూర్తయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్ వసూల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరని పేర్కొన్నారు.

3.62 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్



నిజాంసాగర్: మాగిలోని గాయత్రి చక్కెర కార్మాగారంలో ఈ సీజన్‌లో 3.62 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ జరిగిందని ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. బుధవారం ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముగింపు పూజలు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికిగాను 4.25 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంతో చెరుకు క్రషింగ్ ప్రారంభించామన్నారు. 114 రోజుల్లో 3.62 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు క్రషింగ్ చేశామన్నారు. కార్మాగారం పరిధిలో చెరుకు పండించిన 4,500 మంది రైతులు కార్మాగారానికి పంటను తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కేన్ మేనేజర్ వెంగళ్ రెడ్డి, జీఎం సుబ్బారెడ్డి, డీజీఎం శ్రీనాథ్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సుగుణ భూషణ్‌రెడ్డి, ప్రతినిధులు భక్త వత్సల్‌రెడ్డి, ప్రభాకర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'వికసిత భారత్ వైపు అడుగులు వేయాలి'



కామారెడ్డి అర్బన్: ఆత్మ నిర్బర్ భారత్ లక్ష్యాలను చేరుకుని, వికసిత భారత్ వైపు అడుగులు వేయాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాస్త్ర సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన హేమవంతిని, శ్రీజ, మౌనిక, శ్రీవాణి, హరిణి, కావేరీలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భిక్కనూరులోని తెయూ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, కార్యక్రమ సమన్వయకర్త రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, శంకరయ్య, శారద, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



కామారెడ్డి క్రైం : సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతీ ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని సైబర్ సెల్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు డిజిటల్ లావాదేవీలు, పొదుపు, మ్యూచువల్ ఫండ్స్, సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత అంశాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, లీడ్ జిల్లా మేనేజర్ భార్గవ సుధీర్, అధికారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకోసారి పండుగ!



పుట్టిన రోజు.. పెళ్లి రోజు ప్రతి మనిషి జీవితంలో మరిచిపోలేనివి. ఆ రోజును ప్రతి ఏటా ఘనంగా జరుపుకోవాలనుకుంటారు.. కానీ వీరు మాత్రం తమ బర్త్ డే, మ్యారేజ్ డేలను నాలుగేళ్లకోసారి జరుపుకుంటారు. లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29న తమ జన్మదినం, వివాహ వార్షికోత్సవాలు ఉండటమే అందుకు కారణం.. ఆ రోజు కోసం నాలుగేళ్లు నిరీక్షించి పండుగలా చేసుకుంటామని వారు చెబుతున్నారు. నేడు ఫిబ్రవరి 29 సందర్భంగా ప్రత్యేక కథనం.. – సాక్షి, కామారెడ్డి

- వీళ్ల బర్త్‌డే, మ్యారేజ్‌డే వెరీ స్పెషల్
- ఫిబ్రవరి 29న జన్మించిన, పెళ్లి చేసుకున్న వారి మనోగతం
- 'ప్రత్యేక రోజు' వేడుకలకు సిద్ధం

ఇప్పటి వరకు ఐదుసార్లే బర్త్‌డే..



బాన్సువాడ: బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీకి చెందిన రంగపవర్ విఠల్‌చారి–భాగ్యలక్ష్మి దంపతులకు 2004 ఫిబ్రవరి 29న దీక్షిత్‌కుమార్ జన్మించాడు. ప్రస్తుతం దీక్షిత్‌కుమార్ డిగ్రీ చదువుతున్నాడు. నాలుగేళ్లకోసారి దీక్షిత్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను పండుగల జరుపుతామని తల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. 20 ఏళ్లలో ఐదు సార్లు మాత్రమే పుట్టిన రోజు వేడుకలను నిర్వహించామని, ప్రత్యేక ఏర్పాట్లు చేసి బంధువుల సమక్షంలో జరుపుతామని పేర్కొన్నారు.

సంతోషంగా ఉంది



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ తండాకు చెందిన నేనావత్ సునీత వివాహం బాలు అనే వ్యక్తితో జరగనుంది. ఫిబ్రవరి 29న పెళ్లంటే సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. అందరి వివాహ వార్షికోత్సవం ఏడాదికోసారి తనది నాలుగేళ్లకోసారి వస్తుందని చెబుతున్నారు.

పెళ్లిరోజు ప్రత్యేకం



గాంధారికి చెందిన కోనె మాలతి, రమేశ్ బాబు పెళ్లి 1988 ఫిబ్రవరి 29న జరిగింది. అప్పటి నుంచి నాలుగేళ్ల కోసారి పెళ్లి రోజు జరుపుకుంటారు. అందరిలా కాకుండా తమ పెళ్లిరోజు ప్రత్యేకతతో కూడుకున్నది కావడంతో అందరూ పెళ్లి రోజు కోసం ఎదురు చూస్తారని చెబుతున్నారు మాలతి, రమేశ్‌బాబు.

ఆ థ్రిల్లే వేరు



భిక్కనూరుకు చెందిన స్వప్న, మహేశ్‌గౌడ్‌ల కూతురు వర్షిణి 2004 ఫిబ్రవరి 29న జన్మించింది. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వర్షిణి తన పుట్టిన రోజు గురించి మాట్లాడుతూ థ్రిల్లింగ్‌గా ఉంటుందని చెబుతోంది. తన పుట్టిన రోజు గురించి నాలుగేళ్లు ఎదురు చూస్తుంటానని చెప్పింది.

పండుగలా జరుపుకుంటాం



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజీవాడికి చెందిన శేర్ బద్దం చంద్రారెడ్డి, సరోజనకు 2004 ఫిబ్రవరి 29న పెళ్లయింది. నాలుగు వసంతాలకు ఒక సారి వచ్చే పెళ్లిరోజును పండుగలా చేసుకుంటామని వారు తెలిపారు. ఆ రోజు ఇల్లంతా పండుగా వాతావరణంలా ఉంటుందన్నారు.

మిగతా వారిని చూస్తే బాధేస్తుంది



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన జంగం రాజాగౌడ్ – రాజమణి దంపతులకు 2004 ఫిబ్రవరి 29న పెళ్లి జరిగింది. నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీపు సంవత్సరంలో పెళ్లి రోజు జరుపుకోవడం ప్రత్యేకంగా అనిపించినా ప్రతి ఎటా జరుపుకునే వారిని చూస్తే బాధేస్తుందని అంటున్నారు ఆ దంపతులు. పెళ్లి రోజు ఎప్పుడు వస్తుందా అని పిల్లలు సైతం ఎదురు చూస్తాంటారని పేర్కొన్నారు. తమ పెళ్లి రోజును పిల్లలు బాగా జరుపుతారని, బంధు మిత్రులు శుభాకాంక్షలు ప్రత్యేకంగా చెబుతారని వారు తెలిపారు.

గ్రాండ్‌గా బర్త్‌డే..



దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మంతూరి గోపాల్‌గౌడ్–దివ్యల కూతురు సాత్విక 2012 ఫిబ్రవరి 29న జన్మించింది. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతోంది. నాలుగేళ్లకోసారి బర్త్‌డేను పండగా జరుపుకుంటామని సాత్విక తండ్రి గోపాల్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సారి కూడా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేస్తామన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



కామారెడ్డికి చెందిన ఉచిది సందీప్‌రెడ్డి 1992లో ఫిబ్రవరి 29న జన్మించాడు. 32ఏళ్ల వయసులో 8 సార్లు బర్త్ డే ఆడంబరంగా జరుపుకోవడం ఆనందాన్ని ఇచ్చింది అంటున్నారు. అందరి మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

ఆనందంగా ఉంటుంది



రాజంపేట: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రేఖ, రాములు వివాహం 2012 ఫిబ్రవరి 29న జరిగింది. నాలుగేళ్లకు ఒకసారి పెళ్లి రోజు జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఇలాంటి మధుర క్షణాలు మరిచిపోలేనివని పేర్కొన్నారు.

సమ్‌థింగ్ స్పెషల్



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌కు చెందిన దాశ లత, మోర్తాడ్‌కు చెందిన మర్రి అజయ్‌కుమార్ జంట నేడు(గురువారం) వివాహంతో ఒకటి కాబోతోంది. ఫిబ్రవరి 29న వివాహం చేసుకోవడం ప్రత్యేకంగా అనిపిస్తోందని ఈ జంట చెబుతోంది. అందరికి ఏడాదికోసారి వచ్చే వార్షికోత్సవం తమకు నాలుగేళ్లకోసారి వస్తోందని.. పెళ్లి రోజు సమ్‌థింగ్ స్పెషల్ డే అంటున్నారు.

తర్వాత తెలిసింది..



లింగంపేట: తమ గురుబలం ప్రకారం 2004 ఫిబ్రవరి 29న పెద్దలు పెళ్లి నిర్ణయించారని చెబుతున్నారు లింగంపేటకు చెందిన పోకల సావిత్రిసాయిరాం దంపతులు. తమ పెళ్లి రోజుకు ప్రత్యేకత ఉన్నట్లు వివాహం అయ్యాక తెలిసినట్లు వారు తెలిపారు. అప్పటి నుంచి నాలుగేళ్లకు ఒకసారి పెళ్లి రోజును ఘనంగా చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జిల్లా కేంద్రంలోని వశిష్ఠ జూనియర్ కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాలను ఉదయం 8.30 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్‌ల నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించారు. సీసీ కెమరాల పర్యవేక్షణలో వాటిని ఓపెన్ చేశారు. జిల్లాలో మొత్తం 37 పరీక్ష కేంద్రాలలో 9,750 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 9,329 మంది రాశారు. 421 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 8,211 మందికిగాను 7,925 మంది పరీక్షకు హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,539 మందికిగాను 1,404 మంది పరీక్ష రాశారు. చాలాచోట్ల చివరి క్షణాల్లో పరుగులతో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. బాన్సువాడ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి పిట్లం మండలం బండపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని మూడు నిమిషాల ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. పెద్ద ఎక్లార గేటు వద్ద గల బాలికల గురుకుల కళాశాలలో సీఈసీ చదువుతున్న మనీష మద్నూర్‌లోని పరీక్ష కేంద్రానికి పది నిమిషాల ఆలస్యంగా చేరుకుంది. ఆమెను కేంద్రంలోనికి అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగింది. జిల్లా కేంద్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పరీక్ష కేంద్రానికి సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్‌లలో అడ్రస్ జీవీఎస్ కళాశాల వద్ద అని పాత భవనం సెంటర్ పేరు ప్రచురితం కావడంతో కొందరు విద్యార్థులు అయోమయానికి గురయ్యారు.

అధికారుల పర్యవేక్షణ



కామారెడ్డిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

జిల్లా కేంద్రంలోని అర్యభట్ట జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పరీక్ష కేంద్రంలో వసతుల గురించి తెలుసుకున్నారు. ఆయన రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కేంద్రాన్నీ తనిఖీ చేశారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సలాం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లోని కేంద్రాలను పరిశీలించారు.

నిబంధనలకు పాతర

ఇంటర్ పరీక్షల నేపథ్యంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని అధికారులు ఆదేశించారు. అయినా జిల్లా కేంద్రంలో చాలాచోట్ల జిరాక్స్ కేంద్రాలు తెరిచే ఉన్నాయి. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లు తెరిచి ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. డీఎస్పీ కార్యాలయం ప్రాంతంలో రెండు జిరాక్స్ కేంద్రాలు, జన్మభూమిరోడ్, విద్యానగర్ కాలనీలలో రెండు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న నాలుగు జిరాక్స్ సెంటర్‌లు తెరిచే ఉన్నాయి. అలాగే నిజాంసాగర్ చౌరస్తా, దేవునిపల్లిరోడ్, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ జాతీయ రహదారి పక్కనున్న పరీక్ష కేంద్రాల వద్దా ఇదే పరిస్థితి ఉంది.



వశిష్ఠ జూనియర్ కళాశాల సెంటర్ సమీపంలో తెరిచి ఉన్న జిరాక్స్ సెంటర్

నేడు జిల్లాలోకి విజయ సంకల్ప యాత్ర

- రెండు రోజులపాటు నిర్వహణ
- నాలుగు నియోజక వర్గాలలో రోడ్‌షోలు, సభలు
- పాల్గొననున్న డీకే అరుణ, కేవీఆర్

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర జిల్లాలోకి గురువారం ప్రవేశించనుంది. రెండు రోజుల పాటు జిల్లాలో యాత్ర కొనసాగనుంది. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సంకల్ప యాత్రలో పాల్గొంటారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు టి.అరుణతార తెలిపారు.

ఏర్పాట్లు చేస్తున్న నేతలు...

బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రకు జన సమీకరణపై ఆ పార్టీ నేతలు దృష్టి సారించారు. జహీరాబాద్ ఎంపీ టికెట్టు రేసులో ఉన్న నేతలు యాత్రను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో యాత్ర కొనసాగనుంది. ఆయా పట్టణాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే రోడ్ షోలు, సభల్లో ఎక్కువ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్రను విజయవంతం చేయడం ద్వారా వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తోంది.

యాత్ర సాగుతుందిలా..

విజయ సంకల్ప యాత్ర గురువారం సాయంత్రం 4 గంటలకు జుక్కల్ నియోజకవర్గంలోని బాబుల్‌గావ్ గ్రామానికి చేరుకుంటుంది. అక్కడి నుంచి జుక్కల్ మండల కేంద్రానికి చేరుకుని రోడ్‌షో నిర్వహించి, సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు బిచ్కుంద మండల కేంద్రంలో రోడ్‌షో, సభ ఉంటాయి. రాత్రి 7 గంటలకు బాన్సువాడ పట్టణంలో రోడ్‌షో, పబ్లిక్ మీటింగ్ నిర్వహిస్తారు. రాత్రి బాన్సువాడలోనే బస చేస్తారు. శుక్రవారం ఉదయం మీడియా సమావేశం అనంతరం యాత్ర ప్రారంభమవుతుంది. ఎల్లారెడ్డి పట్టణంలో రోడ్‌షో అనంతరం సభ ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు నాగిరెడ్డిపేటలో విజయ సంకల్ప యాత్ర కొనసాగుతుంది. మధ్యాహ్నం లింగంపేట మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు గాంధారి, 4 గంటలకు సదాశివనగర్‌లలో రోడ్‌షోలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు రామారెడ్డి మండల కేంద్రంలో రోడ్‌షో, సభలు నిర్వహిస్తారు. అనంతరం కామారెడ్డి పట్టణానికి చేరుకుని పట్టణంలో రోడ్‌షో, సభలు నిర్వహిస్తారు. రాత్రి కామారెడ్డి పట్టణంలో బస చేస్తారు. శనివారం ఉదయం బీజేపీ నేతలు మీడియా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం విజయ సంకల్ప యాత్ర మాచారెడ్డి మండలం మీదుగా సిరిసిల్ల జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

నిజామాబాద్‌లో పసుపు ధర రూ.14 వేలు

- 'ఎక్స్'లో పోస్ట్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు పంటకు క్వింటాలుకు రూ.14 వేల మద్దతు ధర దక్కడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్విట్టర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

తక్షణం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కాగా నిజామాబాద్ మార్కెట్‌లో బుధవారం పసుపు క్వింటాలుకు గరిష్ఠంగా రూ.14,255 ధర పలికింది.

క్లుప్తంగా

హైకోర్టు ఏజీపీగా ధరావత్ రవి నియామకం


ధరావత్ రవి

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో ప్రభుత్వం తరపున వాదించేందుకు ప్రభుత్వం జీపీ, ఏజీపీల నియామకపు ప్రక్రియ చేపట్టింది. అందులో భాగంగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం తండాకు చెందిన యువ న్యాయవాది ధరావత్ రవి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న రవిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించారు. మూడేళ్ల పాటు ఏజీపీగా కొనసాగనున్నారు. తన నియామానికి కృషి చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ర్యాగట్లపల్లి విద్యార్థికి గోల్డ్ మెడల్



భిక్కనూరు : మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి హేమంత్ రెడ్డి హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో గోల్డ్ మెడల్ సాధించాడు. రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా బుధవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా అవార్డును అందుకున్నాడు. గ్రామానికి చెందిన వ్యక్తికి అవార్డు రావడం పట్ల గ్రామస్తులు, కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు నిరంతరం సేవ చేస్తా



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రభుత్వానికి, ప్రజలకు తాను అనుసంధానంగా ఉండి ప్రజలకు నిరంతరం సేవ చేస్తానని నాగిరెడ్డిపేట ఎంపీపీ దివిటి రాజ్‌దాస్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియ నిలిపివేసిన నేపథ్యంలో ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడారు. తాను ఎంపీపీ పదవిలో కొనసాగేలా కృషి చేసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు ఇమామ్, నర్సింహారెడ్డి, పర్వతరావు, గులాం ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్, ముగ్దుంపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం కాంప్లెక్స్ హెచ్ఎం మధుసూదన్ రాజ్ తనిఖీ చేశారు. మహమ్మద్ నగర్ కాంప్లెక్స్ పరిధిలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన, మధ్యాహ్నం భోజన నిర్వహణ తీరును ఆయన తెలుసుకున్నారు. హెచ్ఎం సత్యనారాయణ, శ్యామల, అనుష, సీఆర్పీలు శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేర విచారణ సమర్థవంతంగా ఉండాలి

- పెండింగ్ కేసులను పరిష్కరించాలి
- ఎస్పీ సింధు శర్మ


అవార్డును ప్రదానం చేస్తున్న ఎస్పీ సింధు శర్మ


రిజర్వ్ ఎస్సై చంద్రశేఖర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం : నేర విచారణ మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నేర స్వభావం కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో యాక్ట్ కేసుల్లో విచారణలో వేగం పెంచాలన్నారు. జిల్లాలో మిస్సింగైన మహిళలు, చిన్న పిల్లలు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే గుర్తించాలన్నారు. గుట్కా, గంజాయి, పేకాట, అక్రమ ఇసుక రవాణా లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వడ్డీలు వసూలు చేసుతన్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహన తనిఖీలు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు పెట్టాలన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో చంద్రశేఖర్ గౌడ్ ప్రతిభ

కామారెడ్డి క్రైం : 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలు ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీహెచ్ఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగాయి. కామారెడ్డి జిల్లా పోలీస్‌శాఖ రిజర్వ్ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్ గౌడ్ ఈ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించారు. జాతీయస్థాయిలో విజేతగా నిలవడమే కాకుండా వచ్చే మే నెలలో శ్రీలంకలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో దేశం తరపున పాల్గొనడానికి ఆయన ఎంపిక కావడం అభినందనీయమని ఎస్పీ సింధు శర్మ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమావేశంలో భాగంగా ఎస్సై చంద్రశేఖర్ గౌడ్‌ను ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో కామారెడ్డి జిల్లా తరపున 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న చంద్రశేఖర్ గౌడ్ రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి (బంగారు పతకం) సాధించి జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ పోటీల్లో నెల 8 నుండి 11 వరకు జరిగిన బంగారు పథకాన్ని సాధించడం రాష్ట్ర పోలీస్ శాఖకు గర్వకారణం అన్నారు. పోలీస్ శాఖ క్రీడాకారులకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి నరసింహారెడ్డి, డీఎస్పీలు,సీఐలు,ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డుల అందజేత..

ఇటీవలి కాలంలో విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసులకు నేర సమీక్ష అనంతరం ఎస్పీ సింధు శర్మ అవార్డులను అందజేశారు. అవార్డులు పొందిన వారిలో ఏవో అఫ్సర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవీందర్ సింగ్, జూనియర్ అసిస్టెంట్ శివ, ఎస్సై ఉస్మాన్, ఏఎస్సైలు ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వర్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సాయాగౌడ్, రవికుమార్, మురళి, జి సాయన్న, విక్రమ్ రెడ్డి, కానిస్టేబుళ్ళు కరుణాకర్, విశ్వనాథం, ఎం.రాజు, రాజు, బుచ్చయ్య, గంగాధర్, అశోక్, హెడ్ కానిస్టేబుల్, సంజీవులు, రవీందర్, సంజీవ్, గణేష్, నర్సింలు, రాములు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, మధన్ లాల్, ఎస్‌బీ సీఐ జార్జ్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆశలు

- జిల్లాలో భర్తీ కానున్న 506 పోస్టులు
- గతంలో కంటే 220 అధికం
- నేడు వెలువడనున్న డీఎస్సీ నోటిఫికేషన్!

ఎల్లారెడ్డి రూరల్: ప్రభుత్వం డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులను పెంచడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన ప్రభుత్వం గురువారం కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సమాచారం. గత నోటిఫికేషన్‌లో జిల్లాలో 285 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. కొత్త నోటిఫికేషన్‌లో 506 పోస్టుల భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఎస్‌జీటీ 354, స్కూల్ అసిస్టెంట్ 132, లాంగ్వేజ్ పండిట్ 15, పీఈటీ 5 పోస్టులు ఉన్నాయి. జిల్లాకు అదనంగా 221 పోస్టులు రావడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోటీ తీవ్రం..

జిల్లాలో 1011 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 96 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 4,081 మంది ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నారు. ప్రస్తుతమున్న ఉపాధ్యాయులకు అదనంగా మరో 506 పోస్టులు భర్తీ కానుండటంతో పాఠశాలల్లో టీచర్ల కొరత తీరనుంది. 2017 నుంచి డీఎస్సీ నిర్వహించకపోవడంతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు తీవ్రంగా పోటీ ఉండనుంది. గతంలో కంటే కొంత మేర పోస్టులు పెరిగినా పోటీ భారీగానే ఉండనుంది. టెట్ క్వాలిఫై అయిన వారు బ్యాచులు బ్యాచులుగా ఉండడంతో పాటు ఇటీవల గురుకుల పోస్టుల భర్తీ జరుగుతున్న కారణంగా చాలా మంది ప్రిపరేషన్‌లో ఉన్నారు. జిల్లాలో టెట్‌లో పేపర్–1లో 4,228 మంది, పేపర్–2లో 5,102 మంది క్వాలిఫై అయ్యారు.

ఆనందంగా ఉంది



కొత్త నోటిఫికేషన్‌లో టీచర్ పోస్టుల సంఖ్య పెంచడం ఆనందంగా ఉంది. గతంలో తక్కువ స్థాయిలో పోస్టుల భర్తీ ఉండడంతో పోటీ ఎక్కువగా ఉండేది. పోస్టుల సంఖ్య పెరగడంతో కొంత మేర పోటీ తగ్గే అవకాశం ఉంది.

– అనిల్‌కుమార్, ఎంఏ, బీఈడీ, ఎల్లారెడ్డి

నూతన జిల్లాల ఆధారంగా భర్తీ చేయాలి



నూతన జిల్లాల ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. గత డీఎస్సీ కంటే పోస్టుల సంఖ్య పెరగడం ఆనందాన్ని కలిగిస్తుంది. షెడ్యూల్ ప్రకారం పోస్టుల భర్తీ చేపట్టాలి.

– శ్రీకాంత్, ఎంఏ, బీఈడీ, ఎల్లారెడ్డి

మనల్ని ఆదర్శంగా తీసుకునే స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి

బీబీపేట: పాఠశాలలో చదివి ఇంకొకరు మనల్ని ఆదర్శంగా తీసుకునే స్థాయికి ఎదగాలని బీబీపేట బాలుర ఉన్నత పాఠశాల నిర్మాణ దాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం అవడం ఎలా అనే అంశం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు మెదక్ డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ రావు కార్యక్రమానికి హాజరయ్యారు. అంతే కాకుండా ఇదే పాఠశాలలో ఎంతో మంది చదివి గొప్ప స్థాయిలోకి ఎదగారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు అనగానే గొప్ప స్థాయిలో ఉన్నారనే భావన కలగాలని శ్రీనివాస్ రావు విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం రవీంద్రరెడ్డి తదితరులున్నారు.

గుత్ప ఎత్తిపోతల పనుల్లో నిర్లక్ష్యం తగదు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- రైతులతో కలిసి పనుల పరిశీలన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మాక్లూర్: గుత్ప ఎత్తిపోతల పనుల్లో నిర్లక్ష్యం తగదని సంబంధిత అధికారులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశించారు. మండలంలోని గుత్ప గ్రామంలో చేపడుతున్న గుత్ప ఎత్తిపోతల పథకం పనులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, పది గ్రామాల రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ హయంలో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ఎత్తిపోతల పథకం పనుల్లో పూర్తికాకపోవడంలో ఆంతర్యమేమిటని మేజర్ ఇరిగేషన్ ఈఈ భానుప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వేపట్టాల వద్ద పనులు చేపట్టడానికి అనుమతికై జాప్యం జరిగిందన్నారు. జూన్ నాటికి ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోనికి తేవాలని ఎమ్మెల్యే ఈఈని ఆదేశించారు. నత్తనడకన సాగుతున్న ఎత్తిపోతల పనుల విషయమై ఎమ్మెల్యే స్పందించటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకం..

డిచ్‌పల్లి: బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి సహకార సొసైటీ చైర్మన్‌గా యానంపల్లికి చెందిన ఎం.రాంచందర్ గౌడ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించడానికి గతంలోని ఎజెండాలో పెట్టామని దానికి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అర్వింద్ పేపర్ మీద ప్రకటించారని కానీ నేటి వరకు అతిగతి లేదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటేనని ఆరోపించారు. అంతకుముందు డీసీవో కార్యాలయ అధికారి బుచ్చన్న నూతన చైర్మన్ రాంచందర్‌గౌడ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే చైర్మన్‌ను సత్కరించారు.

కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, ధర్మగౌడ్, సొసైటీ డైరెక్టర్లు, వైస్ చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం, సొసైటీ సీఈవో కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, నాయకులు కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, బూస సుదర్శన్, ఏజీ దాస్, డాక్టర్ షాదుల్లా, న్యాస రాజేశ్వర్, ఎంపీటీసీ నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



కామారెడ్డి రూరల్ :నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని డీఎల్‌పీవో శ్రీనివాస్‌రావు సూచించారు.బుధవారం మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్డు, శ్మశాన వాటిక, జీపీ రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రతి నర్సరీలో 10వేల మొక్కలకు తగ్గకుండా చూడాలన్నారు.అలాగే జీపీల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి నవనీతలు ఉన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా



బీబీపేట : విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ శాఖ చర్యలు తీసుకుందని, నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఏడీఈ కిరణ్ చైతన్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ బిల్లులను వసూలు చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగం, తదితర సమస్యలను ఇప్పటికే గుర్తించామన్నారు.

అందమైన ఉదయం



వేకువజామున ప్రశాంతమైన వాతావరణం, స్వచ్ఛమైన చల్లటి గాలి వీస్తున్న సమయంలో కనబడిన సూర్యుడి లేలేత కిరణాలు చూపరులకు ఆకట్టుకున్నాయి. బుధవారం వేకువజామున మద్నూర్ సమీపంలోని జాతీయ రహదారిపై సాక్షి ఈ దృశ్యాన్ని క్లిక్ మనిపించింది. - మద్నూర్(జుక్కల్)

ఘనంగా టైలర్స్ డే

మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో బుధవారం దర్జీలు టైలర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మేరు సంఘం అధ్యక్షుడు నర్సింలు మాట్లాడారు. ప్రభుత్వం మేరు కులస్తులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేరు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్,ప్రతినిధులు బిక్షపతి, నితీష్, కృష్ణ,సత్యం, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. వరుసగా ఆ పార్టీని కౌన్సిలర్‌లు వీడుతున్నారు. బుధవారం 46వ వార్డు కౌన్సిలర్ కోయల్‌కర్ కన్నయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో పార్టీలో చేరారు. మున్సిపల్ కౌన్సిల్‌లో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 25కు చేరుకుంది. అశోక్ రెడ్డి, పండ్ల రాజు, రవి, విజయ్ తదితరులున్నారు.

కుమారుడిని వదిలి.. మహిళ అదృశ్యం

- ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానం
- నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్ద గాలింపు


రోడ్డుపైకి వచ్చిన ఏడాది బాలుడు యోగేష్


కుమారుడు, భర్తతో శిరీష(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): "అమ్మా నేను బస్సెక్కి వస్తున్నా.. బాన్సువాడ బస్టాండ్‌కు వచ్చి ఉండమ్మా" అంటూ కన్న తల్లికి ఫోన్ చేసి చెప్పిన కూతురు.. బాన్సువాడ చేరలేదు. మార్గమధ్యలో బస్సు దిగి ఏడాది వయసున్న కుమారుడిని రోడ్డు పక్కన వదిలి మాయమైంది. నిజాంసాగర్ ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట గ్రామానికి చెందిన ఆందోల్ శిరీష(25) ఏడాది వయసున్న కుమారుడు యోగేష్‌తో కలిసి బుధవారం తాడ్కోల్‌లోని తన పుట్టింటికి వెళ్లడానికి బయలుదేరింది. శిరీషను అమె భర్త సతీష్ ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బస్సు ఎక్కించాడు. అయితే శిరీష బాన్సువాడకు కాకుండా మధ్యలో ఉన్న మహమ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ స్టేజ్ వరకు మాత్రమే టికెట్టు తీసుకుంది. అక్కడ బస్సు దిగి ప్రధాన రహదారి పక్కనే ఉన్న నిజాంసాగర్ ప్రధాన కట్ట వద్దకు వెళ్లింది. కాలువ కట్ట వద్ద చెట్టు కింద కుమారుడిని కూర్చోబెట్టి, హ్యాండ్ బ్యాగ్, ఆధార్ కార్డు, బస్సు టికెట్టు అక్కడే ఉంచి మాయమైంది. ఆమె కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం బాలుడు తల్లి కోసం ఏడుస్తూ రోడ్డుపైకి రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆధార్ కార్డు ఆధారంగా శిరీష భర్త సతీశ్‌కు, ఆమె తల్లి లక్ష్మికి సమాచారం ఇచ్చారు. పోలీసులు నిజాంసాగర్‌నుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో కాలువలో గాలించడం సాధ్యపడలేదు. దీంతో పోలీసులు నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నీటి విడుదలను నిలిపివేయించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు శిరీష్ కోసం ప్రధాన కాలువ వెంట గాలించినా ఆచూకీ లభించలేదు. అల్లుడు సతీశ్ వేధింపుల కారణంగా తన కూతురు ఆత్మహత్య చేసుకుని ఉంటుందని శిరీష తల్లి లక్ష్మి ఆరోపించింది. కాగా వారం క్రితమే శిరీష, సతీశ్ దంపతులు తమ కుమారుడి ఫస్ట్ బర్త్‌డే జరుపుకున్నారు. అంతలోనే శిరీష కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు.

క్రైం కార్నర్

దుబాయిలో బాల్కొండ వాసి మృతి


ఈర్ల మల్లయ్య (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన ఈర్ల మల్లయ్య(62) దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లిన మల్లయ్య నాలుగు రోజుల క్రితం గదిలో ఉండగానే గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతదేహం స్వగ్రామానికి తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రైల్వే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

ఖలీల్‌వాడి: వేసవికాలంలో రైలులో ప్రయాణించేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని రైల్వేఎస్సై సాయిరెడ్డి బుధవారం సూచించారు. వేసవికాలంలో ప్రయాణికులు రైలులో కిటికీల వద్ద కూర్చున్నపుడు ప్రయాణికుల మెడలోని బంగారు చైన్‌లు ఇతరులకు కనిపించే విధంగా ఉంచరాదన్నారు. ప్రయాణంలో దొంగతనాలు ఎక్కువగా పెరిగే అవకాశాలు ఉన్నందున బ్యాగులో విలువైన బంగారు వస్తువులు, డబ్బులు ఉంచరాదని, సెల్‌ఫోన్‌లు చార్జింగ్ పెట్టి పడుకోరాదని సూచించారు. రైలు ఆగి కదులుతున్న సమయంలో వాష్ రూమ్‌ల వద్ద ఉండరాదన్నారు. మహిళలను ఎవరైనా ఇబ్బంది పెట్టినా, వస్తువులు పోయినా వెంటనే డయల్ 139కు ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర సమయంలో 87126–58591 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బట్టలు ఉతకడానికి వెళ్లి మృత్యువాత

మాచారెడ్డి: బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు నీటమునిగి మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం ఫరీదుపేటలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి అనిల్(30) బుధవారం గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లారు. స్నానం చేయడానికి చెరువులోకి దిగిన అనిల్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. గమనించిన ఇద్దరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు

ఉప్పల్‌వాయిలో యువకుడి ఆత్మహత్య

రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయికి చెందిన నవీన్ (23) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కొండ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీన్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. తన తల్లి నాగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. నాటి నుంచి తల్లిని గుర్తుకు చేసుకుంటూ బాధపడేవాడని కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి తండ్రి వ్యవసాయ పొలానికి వెళ్లగానే ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

నవీపేట: మండల కేంద్రంలోని నెహ్రూరోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బుధవారం వేకువజామున చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం రూంలోకి చొరబడి ఏటీఎం బాక్స్‌ను ధ్వంసం చేశారు. ఆధునిక టెక్నాలజీతో ఇంటర్నెట్‌ను అనుసంధానించడంతో ముంబాయిలోని ప్రధాన ఎస్‌బీఐ కార్యాలయంలో సైరన్ మోగింది. దీంతో అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు స్థానిక పీఎస్‌కు వెంటనే ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకునులోపే అనుమానం వచ్చిన దుండగులు పారిపోయారు. రంగంలోకి దిగిన క్లూస్‌టీమ్ దుండగుల వేలిముద్రలను స్వీకరించింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- బాల్కొండలో ఉరేసుకొని ఆత్మహత్య
- భర్త, అత్త, మామలే చంపారంటూ బంధువుల ఆరోపణ


లావణ్య (ఫైల్)

బాల్కొండ: అత్తింటి వేధింపులకు వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ధర్మాయి లావణ్య(32)కు అదే గ్రామానికి చెందిన రాజేందర్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు జన్మించిన నాటి నుంచి భర్త, అత్త, మామలు వరకట్న వేధింపుల కోసం ఇబ్బందులు పెట్టేవారు. ఈ క్రమంలో వీరి వేధింపులు ఎక్కువ కావడంతో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లావణ్య తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త, అత్త, మామలు పోలీసు అదుపులో ఉన్నట్లు తెలిపారు.

పీఎస్ ఎదుట ఆందోళన

లావణ్యను భర్త రాజేందర్, అత్త లక్ష్మీబాయి, మామ పెద్దన్నలు కలిసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించరంటు మృతురాలి బంధువులు బాల్కొండ పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొంత కాలంగా కోర్టులో కేసు ఉండగా గురువారం విచారణ ఉందని గమనించి మంగళవారం రాత్రి చంపేశారంటు ఆరోపించారు. పదేళ్లుగా చిత్రహింసాలు పెట్టారని విలపించారు. నిందితులను తమకు అప్పగించాలంటూ నినాదాలు చేశారు. నిందితులకు శిక్షపడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కుల పెద్దలు, పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు


కేతావత్ సవైసింగ్, కేతావత్ కిషన్(ఫైల్)

పిట్లం: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని పిట్లం–బాన్సువాడ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్ తండాకు చెందిన హలావత్ సుభాష్, కేతావత్ కిషన్, కుమారుడు కార్తీక్, కేతావత్ సవైసింగ్‌లు మండలంలోని రూమ్ తండాలో నిర్వహించిన సుభాష్ చెల్లెలి వివాహానికి మంగళవారం వెళ్లారు. వీరు అర్ధరాత్రి 2 గంటల సమయంలో నలుగురు ఒకే బైక్‌పై తిరిగి వస్తుండగా బాన్సువాడ గేట్ సమీపంలోని పిట్లం–బాన్సువాడ రహదారిపై బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో కేతావత్ సవైసింగ్ (45) అక్కడికక్కడే మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేతావత్ కిషన్(36) మృతి చెందారు. తీవ్రంగా గాయాలపాలైన సుభాష్‌కు మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా కార్తీక్ స్వల్పగాయాలయ్యాయి. సవైసింగ్ తమ్ముడు దేవీసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.